క్లుప్తంగా

ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి



సిరికొండ: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి శ్రావణ్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం బీజేవైఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ.. నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని, మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీవో నెం. 46ను వెంటనే రద్దు చేయాలని, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని కోరారు. ధర్పల్లి బాబురావు, వావిలాల అజయ్, సూరినీడ గోపి, బచ్చు మారుతి, మాద రవి, నాలకంటి కిషన్, కిరణ్, గూడెం సంతోష్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ చేపట్టనున్న దీక్ష కార్యక్రమ కరపత్రాలను బుధవారం నగరంలో జిల్లా నాయకులు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు సల్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఈనెల 7న వంగపల్లి శ్రీనివాస్ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు దీక్షలో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. నాయకులు జిన్నారం రవి, కిన్నెర అనురాధ, నక్క రమేష్, నారాయణ, సౌజన్య, సాయిబాబా, సాల్మన్, నరసమ్మ, ఎల్లమ్మ, పోసాని, లక్ష్మి పాల్గొన్నారు.

ఆపరేషన్ ముస్కాన్‌పై అవగాహన



ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వే స్టేషన్‌లో బుధవారం 'ఆపరేషన్ ముస్కాన్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైల్వే ఎస్సై సాయిరెడ్డి మాట్లాడుతూ.. 18ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని, వారితో వెట్టి చాకిరి, భిక్షాటన చేయించవద్దని అవగాహన కల్పించారు. చిన్న పిల్లలతో పనులు చేయిస్తే వారిపై కేసులు పెడతామన్నారు. సిబ్బంది చైతన్య తదితరులు ఉన్నారు.

రేపు కలెక్టరేట్ ముట్టడిస్తాం



నిజామాబాద్‌అర్బన్: వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 5న కలెక్టరేట్ ముట్టడి చేస్తున్నట్లు మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కో–ఆర్డినేటర్ సరికెల పోశెట్టి అన్నారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్టుహౌజ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పింఛన్ పెంపు తేదీని ప్రకటించాలన్నారు. లేదంటే ఈనెల 5న కలెక్టరేట్ ముట్టడి చేస్తామన్నారు. నాయకులు నారాయణ, బీరప్ప, యమున, భూమయ్య, రొద్ద ప్రవీణ్, మాదిగ, రాములు, సలీం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నేతల భిక్షాటన



నిజామాబాద్‌అర్బన్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏబీవీపీ నాయకులు నగరంలో భిక్షాటన చేపట్టారు. ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం నిధులను విడుదల చేయాలని, లేదంటే ఉద్యమాలు చేస్తామన్నారు. కన్వీనర్ దామ సునీల్, బాలకృష్ణ, దుర్గాదాస్, మహేష్, ప్రవీణ్, విశాల్, వినయ్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పంచాయతీరాజ్ నూతన డిప్యూటీ ఈఈగా మహమ్మద్ ఇషాక్ అలీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డిచ్‌పల్లి డిప్యూటీ ఈఈగా పని చేసిన శంకర్‌నాయక్ ఈఈగా పదోన్నతిపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఇషాక్ అలీ బాధ్యతలు చేపట్టారు. ఆయన డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాలకు పీఆర్ డీఈఈగా విధులు నిర్వహిస్తారు.

ఇష్టారాజ్యంగా ఎన్నికల డబ్బుల పంపిణీ

- నగర మున్సిపల్‌లో అధికారుల తీరుపై ఉద్యోగుల అసహనం
- పనిచేయని వారికి సైతం డబ్బులు ఇస్తున్నారని ఆరోపణ



ఎన్నికల డబ్బుల పంపిణీ జాబితాలో తమ పేర్లను చూసుకుంటున్న ఉద్యోగులు

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిధిలో పార్లమెంటు ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగులకు, అధికారులకు, సిబ్బందికి ఇటీవల జీతభత్యాలు విడుదల అయ్యాయి. కానీ డబ్బుల పంపిణీలో ఉన్నతాధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకే సాక్షిలో 'ఎన్నికల డబ్బుల పంపిణీలో గందరగోళం' అనే కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై మున్సిపల్ కమిషనర్ మంద మకరందు సీరియస్‌గా స్పందించి ఉద్యోగులకు న్యాయం చేసే విధంగా చూడాలని, సౌత్ ఎమ్మార్వో, మేనేజరుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో తాత్కాలికంగా డబ్బుల పంపిణీకి బ్రేక్ పడగా, మళ్లీ రెండు రోజుల్లోనే పంపిణీకి శ్రీకారం చుట్టారు. దీంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులు పేర్కొంటున్నారు.

రెండు నెలల పనికి రూ.1800 ?

ఎన్నికల డబ్బులు పంపిణీలో గందరగోళం నెలకొనడాన్ని అధికారులు గుర్తించారు. దీంతో మున్సిపల్ మేనేజర్ చాంబర్‌లో డబ్బుల పంపిణీని ఆపివేసి, ఆయా సెక్షన్ల పరిధిలో డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈమేరకు డబ్బులు పంపిణీకి సంబంధించి జాబితా ప్రదర్శించి, డబ్బులు ఇస్తున్నారు. రెండు నెలలు పాటు విధులు నిర్వహించిన ఉద్యోగులకు కేవలం రూ.1800 ఇవ్వడంతో వారు తీవ్ర మనోవేదన గురవుతున్నారు. ఈ డబ్బులు కనీసం దారి ఖర్చులకు కూడా సరిపోవు అంటున్నారు. రాత్రి, పగలు అని తేడా లేకుండా విధులు నిర్వహిస్తే మరీ ఇంత తక్కువ డబ్బులు ఇవ్వడంపై ఆవేదన చెందుతున్నారు. అలాగే చాలామంది పనులు చేయకున్నా డబ్బులు పంపిణీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తమకు సంబంధించిన ఉద్యోగులకు ఎక్కువ మొత్తంలో ఎన్నికల డబ్బులు పంపిణీ చేశారని మిగతా ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. డబ్బుల పంపిణీ విషయంలో గందరగోళం జరుగుతున్న కథనం బయటకు రావడంతో మున్సిపల్ కమిషనర్ సీరియస్‌గా స్పందించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనిచేసిన ఉద్యోగులకు సరైన వేతనం అందించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఇద్దరు పనిచేస్తే.. ఒక్కరికే డబ్బులు..

పార్లమెంట్ ఎన్నికల్లో పనిచేసిన వీడియోగ్రాఫర్లకు డబ్బుల పంపిణీలోనూ వివక్ష చూపుతున్నారని సమాచారం. ఇద్దరు విధులు నిర్వహిస్తే ఒక్కరికే డబ్బులు అందజేశారు. మరొక్క వీడియోగ్రాఫర్‌కు డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. సదరు వీడియోగ్రాఫర్ గత కొన్ని సంవత్సరాలుగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వీడియోగ్రాఫర్‌గా ఫోటోలు, వీడియోలు తీస్తున్నందుకు రూ. లక్షల్లో డబ్బులు రావాల్సి ఉన్నా.. ఇవ్వడంలో తాత్సర్యం చేయడంలో అంతర్యమేమిటో తెలియాల్సి ఉంది.

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్

డిచ్‌పల్లి: నీట్, ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టనున్న దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐపీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎస్‌పీఆర్ డిగ్రీ కాలేజీలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్షపత్రాల లీకేజీ బాధ్యులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, పరీక్షను మళ్లీ నిర్వహించాలన్నారు. బంద్‌కు యాజమాన్యాలు, విద్యార్థులు, మేధావులు సహకరించాలని కోరారు. నాయకులు కర్క గణేష్, రాజేశ్వర్, దినేష్ నాయక్, శివకుమార్, రాజేష్ పాల్గొన్నారు.

తెయూ బంద్‌కు పిలుపు..

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నేడు నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌లో భాగంగా తెలంగాణ యూనివర్సిటీ బంద్‌కు ఎస్‌ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐపీఎస్‌యూ నాయకులు పిలుపునిచ్చారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు. తెలంగాణ యూనివర్సిటీ బంద్‌ను వర్సిటీ విద్యార్థులు వియవంతం చేయాలని కోరారు. నాయకులు శ్రీశైలం, దినేష్, రాజేశ్వర్, గణేష్, అనిల్, అక్షయ్, రవీందర్, మోహిత్, వెంకట్‌నాయక్, ఆకాశ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

శ్రీమద్భాగవత సప్తాహం ప్రారంభం



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఉమామహేశ్వర ఆలయంలో బుధవారం శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. పండితులు ఫణతుల మేఘరాజ్ శర్మ ప్రవచనాలను ప్రారంభించారు. అంతకుముందు కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా విచ్చేసి, స్వామివారికి పండ్లను అందజేశారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ప్రవచనాలు ఉదయం 10 గం.ల నుంచి మధ్యాహ్నం 12గం.ల వరకు సాయంత్రం 5గం.ల నుంచి 7గం.ల వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆలయ కమిటీ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నిత్యావసర సరుకుల అందజేత



నిజామాబాద్‌నాగారం: నగరంలోని గాజులపేటలో గల ఓ నిరుపేద కుటుంబానికి బుధవారం శ్రీలక్ష్మీ చేయూత సేవా సమితి సభ్యులు నెలకు సరిపడా కిరాణసామాగ్రి, నగదును అందజేశారు. సేవా సమితి సభ్యులు లక్ష్మన్, శ్యామ్, చంద్రశేఖర్, ఓంరాజ్ ఉన్నారు.

కళాకారుడికి సన్మానం



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని సీతారాంనగర్‌కాలనీలోని తెలుగు వెలుగు సాంస్కృతిక సమాఖ్య కార్యాలయంలో బుధవారం విశ్వనట చక్రవర్తి ఎస్.వి.రంగారావు జన్మదినం సందర్భంగా కళాకారుడు స్నేహమయి ప్రకాష్‌ను సన్మానించారు. సమాఖ్య అధ్యక్షులు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఇందూరు జంటకవులు వి.పి.చందన్ రావు, కందాళై రాఘవచార్య ఉన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక

ధర్పల్లి: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల విద్యార్థులు ఆరుగురు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారని ప్రిన్సిపాల్ రాజేందర్ సాహెబ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భం విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

డిచ్‌పల్లి: మండలంలోని రాంపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని నల్లవెల్లి హరిణి బాసర ఐఐటీకి ఎంపికైనట్లు హెచ్ఎం కొండ గోవర్ధన్ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

తెయూ విద్యార్థికి సన్మానం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఎంఏ ఎకనామిక్స్ ఫైనల్ ఇయర్ విద్యార్థి ధర్మపురి సాయికుమార్ చదువుకుంటూనే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జూనియర్ అసోసియేట్ ఉద్యోగాన్ని సాధించారు. ఈసందర్భంగా బుధవారం ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు సాయికుమార్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. అర్థశాస్త్ర విభాగాధిపతి పున్నయ్య, అధ్యాపకులు సంపత్, నాగరాజు, స్వప్న, శ్రీనివాస్, దత్తహరి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం


డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ఆయా (కేర్ గీవింగ్ వలంటీర్)గా పని చేయడం కోసం ఆసక్తి గల వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో రాజగంగారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయాకు రూ.3,250 గౌరవ వేతనం అందజేస్తారని తెలిపారు. ఆసక్తిగలవారు ఈ నెల 6వరకు మండల విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వాగులో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి



సిరికొండ: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న దొండ్ల వాగులో చెత్త పారవేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిరికొండకు చెందిన యువకులు కోరారు. ఈమేరకు బుధవారం వారు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంపీడీవో సానుకూలంగా స్పందించితగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ధర్పల్లి బాబురావు, కనగందుల సతీష్, బచ్చు మారుతి, గోపి, అజయ్, రవి, కిరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని రాజారాం స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. అండర్–10 లాంగ్‌జంప్, 100 మీటర్ల పరుగుపందెంలో విజయ్ హైస్కూల్ 5వ తరగతి విద్యార్థి విశ్వతేజ రెండు బంగారు పతకాలు, అండర్–12 విభాగంలో 6వ తరగతి విద్యార్థి ప్రద్యుమ్న క్యాంస పతకం సాధించారు. అలాగే 300 మీటర్ల విభాగంలో 5వ తరగతి విద్యార్థి హార్థిక కాంస్య పతకం, 100 మీటర్ల విభాగంలో 4వ తరగతి విద్యార్థి వరుణ్ కాంస్యపతకాలు సాధించారు. ఈసందర్భంగా బుధవారం విద్యార్థులను, పీఈటీ స్రవంతి, పద్మలతలను స్కూల్ వ్యవస్థాపకురాలు అమృతలత అభినందించారు.

హెల్త్ సబ్ సెంటర్ల తనిఖీ

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసకొత్తూర్, చౌట్‌పల్లిలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలను జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అశోక్, జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ తరుణ్ బుధవారం తనిఖీ చేశారు. వ్యాక్సినేషన్ రిజిస్టర్లను పరిశీలించారు. కేంద్రంలో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు అందుతున్న వైద్య సేవల వివరాలను ఏఎన్ఎంలు గీత, మమతలను అడిగితెలుసుకున్నారు. పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుప్రియ, హెచ్ఈవో సత్యనారాయణ, ఫార్మసిస్ట్ రవి పాల్గొన్నారు.

రోడ్లపై కేజ్‌వీల్స్ నడపొద్దు

రెంజల్: రోడ్లపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు నడిపితే జరిమానా తప్పదని ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ రాజ్ డీఈ రాజయ్య హెచ్చరించారు. బుధవారం రెంజల్, దూపల్లి గ్రామాల్లోని ట్రాక్టర్ యజమానులతో పంచాయతీ కార్యాలయాల్లో సమావేశాలను ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఎంపీవో గౌస్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ధరణిలో అన్ని భూముల వివరాలు నమోదు చేయించాలి



సుభాష్‌నగర్: ధరణి పోర్టల్‌లో అన్ని భూముల వివరాలను రెవెన్యూశాఖ ద్వారా ఎంట్రీ చేయించాలని ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి బుధవారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. ఈసందర్భంగా మార్టిగేజ్ ద్వారా దీర్ఘకాలిక రుణాలు పొందిన వారి భూముల వివరాలు నమోదు కాలేదని, ధరణి పోర్టల్‌లో నమోదు చేస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని రమేష్‌రెడ్డి మంత్రి దృష్టికి తెచ్చారు. పాత రికార్డుల్లో వివరాలు నమోదయ్యాయని, ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాత కొన్ని ఎంట్రీ కాలేవన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే నమోదు చేయిస్తామని తెలిపినట్లు రమేష్‌రెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

ఎడపల్లి: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు నూతన జాతీయ విద్యా విధాన, రివైజ్ ప్రీ స్కూల్ అనే అంశాలపై బుధవారం శిక్షణ నిర్వహించారు. మూడు రోజుల శిక్షణ తరగతు ల్లో భాగంగా వీడియో బోధన ద్వారా ఎడపల్లి, రెంజల్, అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. బోధన్ సీడీపీవో జానకి మాట్లాడు తూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ నూతన వి ద్యా విధానంలో రివైజ్ ప్రీ స్కూల్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు ప్రమీల, ఎడపల్లి మండల సూపర్‌వైజర్ విజయ రాణి, బాల్య సంరక్షణ అధికారి నరేశ్, శిక్షకులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తున్నాం



ఖలీల్‌వాడి: దేశవ్యాప్తంగా 61 బొగ్గు గనులను వేలం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ తెలిపారు. బొగ్గు గనుల వేలం, నీట్ పరీక్ష అవకతవకలపై వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 5న జిల్లాకేంద్రంలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. నగరంలోని ఎన్ఆర్‌భవన్‌లో బుధవారం జిల్లాలోని వామపక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఆకుల పాపయ్య, శ్రీనివాస్, సుధాకర్, రాజశేఖర్, రాజేశ్వర్లు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం



గోదాం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు

- త్వరలోనే రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు
- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. మండలంలోని ముల్లంగి(ఐ) గ్రామంలో మోపాల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన గోదాంను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే డిచ్‌పల్లి సొసైటీ ఆధ్వర్యంలో నక్కలగుట్ట తండ, సుద్దపల్లి గ్రామాల్లో గోదాంల నిర్మాణ పనులు, తెలంగాణ మోడల్ స్కూల్, అమృతాపూర్ యూపీఎస్, శివాలయం వద్ద ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభలలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడారు. ప్రజలు చిత్తుగా ఓడించినా ఇప్పటికీ కేసీఆర్, కేటీఆర్ తామే అధికారంలో ఉన్నట్లు భ్రమపడుతున్నారని, ఇప్పటికైనా ప్రజా తీర్పును గౌరవించి ప్రతిపక్ష పాత్ర పోషించాలని హితవు పలికారు. నియోజకవర్గానికి ఐదేళ్లలో 18వేల ఇందిరమ్మ ఇళ్లు రానున్నాయని పేర్కొన్నారు. మహిళలకు రూ.10లక్షల వడ్డీ లేని రుణాలు అందజేస్తామన్నారు. రెండు మూడేళ్లలో ప్రాణహిత –చేవేళ్ల ప్యాకేజీ 21, 21ఏ పూర్తి చేసి మంచిప్ప ప్రాజెక్టు ద్వారా రూరల్ నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు, ప్రతి గుంట భూమికి సాగు నీరందించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. పోడు భూములకు సంబంధించి వైఎస్సార్ హయాంలో పట్టాలు ఇచ్చిన వారికే రాష్ట్ర ప్రభుత్వం కొత్త పట్టాలు ఇస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, ఎంపీపీ చిన్నోల్ల నర్సయ్య, సొసైటీ చైర్మన్లు గ్యానాజి గంగారెడ్డి, రాంచందర్‌గౌడ్, తారాచంద్, రామకృష్ణ, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, జిల్లా కిసాన్‌కేత్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, కంచెట్టి గంగాధర్, వైస్ ఎంపీపీ సాయిలు, అంజయ్య, భూపతి, మధు, నాయకులు మాలోత్ రవి, గంగారాం, బీమానాయక్, మోబిసింగ్ పాల్గొన్నారు.

మా సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లండి

డిచ్‌పల్లి: తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కేజీబీవీ టీచర్లు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కోరారు. మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) పాఠశాల/ కళాశాలను బుధవారం నిజామాబాద్ ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారిణి సవిత ఆధ్వర్యంలో టీచర్లు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అనంతరం పక్కనే ఉన్న మోడల్ స్కూల్/కాలేజీలో మరమ్మతులకు శంకుస్థాపన చేశారు.

ఎంపీపీ, జెడ్పీటీసీలకు సన్మానం





రూరల్ పరిషత్ సభ్యులను సన్మానిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో మధురిమ.. రావుట్ల గ్రామంలో..

నిజామాబాద్ రూరల్: జిల్లాకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలను మండల అధికారులు ఘనంగా సన్మానించారు. పరిషత్ సభ్యుల పదవీకాలం గురువారం ముగుస్తుండటంతో సన్మానం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో మధురిమ, పీపీ అనుష ప్రేమ్‌దాస్ నాయక్, జెడ్పీటీసీ బొల్లంక సుమలత గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు రూరల్ మండలంలో ఎంపీడీవోగా పని చేసిన మల్లేశ్‌ను ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు సన్మానించారు.

సిరికొండ: మండలంలోని రావుట్ల గ్రామంలో బుధవారం ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ తోట రాజన్నను ఘనంగా సన్మానించారు. ఆయన పదవీ కాలం ముగుస్తుండటంతో సన్మానం చేసినట్లు అధికారులు తెలిపారు. జీపీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ రవీందర్‌రావు, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలయ్య, జీపీ కార్యదర్శి గణేష్, కారోబార్ రాజబాపు, పీఏసీఎస్ డైరెక్టర్ బాబన్న, ఏఎస్ఎం జ్యోతి తదితరులు ఉన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): జీపీ కార్మికుల బకాయి వేతనాల కోసం ఈనెల 5న జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌లో చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రపు సాయాగౌడ్ పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం మండలంలోని మంచిప్ప గ్రామ పంచాయతీలో ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సాయాగౌడ్ మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే ప్రతినెలా వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేసి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. నాయకులు సాయిబాబా, కార్మికులు గంగారాం, లక్ష్మీ, కారోబార్ సావిత్రి, ప్రశాంత్, వాటర్‌మెన్ లక్ష్మణ్, సాయవ్వ, గంగారాం పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సింగ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,800	వెండి (కిలో)	92,000
22 క్యారెట్స్	67,155		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	40	60	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	100
బీరకాయ	50	70	దోసకాయ	20	40
దొండకాయ	15	30	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	100	130	గోబిగడ్డ	25	50
కాకరకాయ	50	75	గోబిపువ్వు	30	50
వంకాయ	10	20	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	75	చామగడ్డ	40	60
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	50	75
పుదీనా	50	75	చిక్కుడుకాయ	60	90
క్యాప్సికం	60	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	కల్కి-2898 ఏడీ(తెలుగు) - 3.10, 7.90, 10.40
స్క్రీన్-2	కల్కి-2898 ఏడీ (తెలుగు) - 10.30 కల్కి-2898 ఏడీ (3డీ తెలుగు) - 4.00, 7.30, 10.45
స్క్రీన్-3	కల్కి-2898 ఏడీ (3డీ తెలుగు) - 1.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కల్కి-2898 ఏడీ(3డీ తెలుగు)-8.00, 11.45, 3.30, 7.15, 11.00
స్క్రీన్-2	కల్కి-2898 ఏడీ(3డీ తెలుగు) - 10.45, 2.30, 6.15, 10.00
స్క్రీన్-3	కల్కి-2898 ఏడీ (తెలుగు) - 9.15, 4.00, 10.45 మహారాజ(తెలుగు)- 1.00, 7.45
స్క్రీన్ -4	కల్కి-2898 ఏడీ (తెలుగు) - 8.30, 12.15 కల్కి-2898 ఏడీ (హిందీ)- 6.45, 10.30 ముంజ్య (హిందీ)- 4.00
దేవి	కల్కి-2898 ఏడీ (తెలుగు)
నటరాజ్	కల్కి-2898 ఏడీ (తెలుగు)
విజయ్	కల్కి-2898 ఏడీ(తెలుగు)